# పున్నమి వెన్నెల

-ఐతా చంద్రయ్య.

అర చేతిలో పాదరసంలా- వెంకటేశం మనసు పత్రిక మీద నిలవడంలేదు. గుండెనిండా వెన్నెల కదలాడుతోంది. మేలిమి బంగారు చెక్కిళ్ళు, తీర్చిదిద్దిన కనుబొమ్మలు, కువకువలాడే వయసు సొగసులు...వారం రోజుల క్రితం వెన్నెల జాయినవగానే ఆఫీసుకే కొత్త అందమొచ్చింది. తన ఎకౌంట్స్ సెక్షన్‌కే అలాటై వయ్యారంగా వచ్చింది.



"నమస్కారమండీ అకౌంటెంట్ గారూ!" అంటూ తనను కమ్మగా పలకరించింది.

అప్పుడామె కళ్ళు అలవోకగా కదుల్తూంటే ఆరువేల రూపాయల అరియర్స్ దొరికినంత ఆనందమన్పించింది.

కొత్తగా రిక్రూటై వచ్చిన కుందన బొమ్మకు ఉద్యోగం కొత్త, పనికొత్త...తనకో సువర్ణావకాశం. పక్క సీట్లోనే కూర్చోబెట్టుకున్నాడు.

డౌట్స్ క్లియర్ చేస్తూ ఆమె కళ్ళలోకి సూటిగా చూడాలని ఎన్నిసార్లు ప్రయత్నించినా కుదరలేదు. జూకాల లావణ్యం తప్ప పెదాల కదలిక కనబడనీయలేదు. కళ్ళు కాయితాని కప్పజెప్పి చెవులు తనకప్పజెప్పేది.

కాని...ఈరోజు మాత్రం లంచవర్లో ఒంటరిగా కలిసి గలగలా నవ్వుతూ మాట్లాడింది.

రాత్రి ఎనిమిదింటికి తన ఇంటి డాబా పైకి డైరెక్ట్‌గా రమ్మంది. ఈరోజు నిండు పున్నమి.
వెన్నెలలో వెన్నెలతో...ఆహా! అదృష్టమంటే తనదే.

లాంగ్ బెల్ మోగింది, లైబ్రరీ మూసేస్తున్నారు...అంటే ఎనిమిదైందన్న మాట, గబగబా బయటికొచ్చేసి ఆటో ఎక్కేసి విద్యానగర్లో దిగాడు.

నిండు పున్నమి వెన్నెల - మచ్చలేని తెల్లని మఖ్మల్ గుడ్డలా డాబానిండా పరుచుకుంది.

ఆకుపచ్చ చీర, తెల్లని జాకెట్టు, జడనిండా మల్లెలు...వెన్నెల కెందుకా పారవశ్యం! అటు తిరిగి ఆకాశం వైపు చూస్తోంది.

పాపం! తనకొరకే ఎదురు చూస్తోన్నటుంది. వెంకటేశం మనోసాగరంలో కొంటె కోర్కెల రాయంచ ఖుషీగా రెక్కలాడించింది.

పిల్లిలా వెళ్లాడు. నడుము చుట్టూ చేతులేసి గట్టిగా అదుముకున్నాడు. చెంప ఛెళ్ళుమంది. గుండె ఝల్లుమంది.

ఆమె...

వెన్నెల కాదు...పూర్ణిమ...తన భార్య పూర్ణిమ. అబ్బా...చెంప మండిపోతోంది.

"అరెరే...మీరా! ఎవడో అనుకున్నానండీ!" పూర్ణిమ కనురెప్పలు పూలమీది తుమ్మెద రెక్కల్లా టపటపలాడినై.

"ఆఁ...నేనే! నువ్వెందుకొచ్చావిక్కడికి?" అయోమయం.

"వెన్నెల నా పాత స్నేహితురాలు. అదీ ఊరు వచ్చే ముందు నాకుత్తరం రాసి మన అడ్రసు కనుక్కొంది. సాయంత్రం మనింటికొచ్చి నన్నిటులాక్కొచ్చింది."

"అలాగా....!"

"ఔను మన పెళ్ళిఫోటోలు చూసి ఎంత మురిసి పోయిందో! అన్నట్టూ...అది మీ ఆఫీసులోనే పంజేస్తుందట గదా!"

"ఔను...నా సెక్షన్‌లోనే! మరి వెన్నెలేదీ!"

"మన బాబిగాడ్ని తీసుకుని ఇప్పుడే కింది కెళ్ళింది. ఇంతకీ మీరెందుకొచ్చారిక్కడికి?" పూర్ణిమ కనుబొమ్మలు అనుమానంగా ఎగిరి పడినై.

"నేనే రమ్మన్నానే పూర్ణిమా!" బాబిగాడితో వచ్చింది వెన్నెల. వెంకటేశ్ చేతికి రాఖీ కడ్తూ "ఈరోజు రాఖీ పూర్ణిమ కదా! మా అన్నయ్యకు రాఖీ కట్టొద్దా! ఏమన్నయ్యా!" కిలకిలా నవ్వేసింది. ఆ నవ్వులో [illegible] పసందు గానముంది.

కొండమీంచి జారి కోనేట్లో పడిపోయినట్టనిపించింది వెంకటేశంకు.

"ఛీఛీ...వెధవ పనులొద్దంటే వింటావా!" అంత రంగం కొరడా ఝుళిపించింది.

"ఔనౌను...నాకో మంచి చెల్లాయి దొరికింది పూర్ణిమా!" వెంకటేశ్ మాటల్లో ఆత్మీయత తొంగి చూసింది. ★

-ఐతా చంద్రయ్య
ఇ.నం.4-4-11 శేర్‌పుర
సిద్ధిపేట-502 103